సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

నేటి సందేశాల రేపటి పొద్దు జాడ
20 YEARS ANNIVERSARY

https://www.satyamdaily.net/

శనివారం 23-8-2025

సంపుటి: 21 సంచిక: 130
పేజీలు: 8 వెల: రూ.1




## అప్పుడు, ఇప్పుడూ అదే ఎనర్జీ సర్..!

### నౌపడ సత్యనారాయణతో చంద్రబాబు చలోక్తి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఢిల్లీ పర్యటనకు వెళ్లారు. ఈ సందర్భంగా తెలుగుదేశం ఎంపీలతో మాటా మంతీ జరుగుతున్నప్పుడు పార్లమెంటరీ పార్టీ కార్యదర్శి నౌపడ సత్యనారాయణ చంద్రబాబుకు విష్ చేశారు. సత్యనారాయణా.. ఎలా ఉన్నారంటూ చంద్రబాబు పలకరించడంతో పక్కనే ఉన్న కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు కల్పించుకుంటూ సత్యనారాయణ అదే ఎనర్జీతో పని చేస్తున్నారని, అప్పట్నుంచి ఇప్పటి వరకు తెలుగుదేశం తరఫున ఎవరు కేంద్రమంత్రి అయినా సత్యనారాయణే సేవలందిస్తున్నారని చెప్పడంతో తానూ చూస్తున్నానని, సత్యనారాయణలో ఏ మార్పూ లేదని, ఢిల్లీ నుంచి సమాచారం కావాలంటే నిమిషాల్లో అందించడం తనకు గుర్తుకొస్తుందన్నారు. అంతకు క్రితం మంత్రి రామ్మోహన్‌నాయుడు ఇంటికి వెళ్లి ఆయన తనయుడ్ని ఒడిలోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌నాయుడు తల్లి విజయమ్మ ఆరోగ్యాన్ని చంద్రబాబు అడిగి తెలుసుకున్నారు.

# నువ్వు మునిగావ్.. ఆయన్నూ ముంచేశావ్!





- సౌమ్య ఆరోపణల కంటే దువ్వాడ స్టేట్‌మెంటే డ్యామేజీ
- కాళింగులకు పెద్దన్న కావాలనే ఆరాటం
- ధర్మాన సోదరులపై మళ్లీ పాతపాటే
- కూన రవిపైన సానుభూతిని చెరిపేసిన శ్రీను

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఈ ఏడాది ఐపీఎల్ ట్రోఫీని ఆర్సీబీ గెలిచింది.. బెంగళూరులో నిర్వహించిన విజయోత్సవ సభలో తొక్కిసలాట జరిగి పదిమందికి పైగా క్రికెట్ అభిమానులు మరణించారు. ఫైనల్స్‌లో రొమారియో షెప్పర్డ్ వేసిన బంతి శ్రేయాస్ అయ్యర్ బ్యాట్‌కు వెంట్రుకవాసి పైగా వెళ్లివుంటే ఆరు పరుగుల తేడాతో బెంగళూరు గెలిచేదికాదు. సెలబ్రేషన్స్ ఉండేవికావు. పదిమంది ప్రాణాలు రక్షింపబడేవి. ఒక చిన్న సంఘటన వల్ల మనిషి జీవితంలో లేదా ప్రపంచ చరిత్రలో మార్పు వస్తే దాన్నే బట్టర్‌ఫ్లై ఎఫెక్ట్ అంటారు. ఈ ఎఫెక్టే ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీను రూపంలో ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవి కుమార్‌కు తగిలింది. పొందూరు కేజీబీవీ ప్రిన్సిపాల్ సౌమ్య తనను రవికుమార్ మానసికంగా, శారీరకంగా వేధించారన్న ఆరోపణలపై జిల్లాలో అధిక శాతం మంది రవికుమార్‌కు నోటిదురుసు ఉందికాబట్టి నాలుగు మాటలు అనుంటారు తప్ప, శారీరకంగా వేధించారంటే నమ్మలేదు. ఇందులో ఎవరు కరెక్టు, ఎవరు కాదు? అన్న ప్రస్తావనకు పోవడంలేదు. అయితే రవికుమార్‌కు మంత్రి పదవి రాబోతుంది కాబట్టి వెలమ సామాజికవర్గానికి చెందిన నేతలు ఆయన మీద కుట్ర చేసి ఇలా ఇరికించారంటూ సామాజికమాధ్యమాల్లో కాళింగులు పెద్ద ఎత్తున ప్రచారం చేయడంతో దీన్ని తనకు అనుకూలంగా మలచుకోవడం కోసం ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీను రంగప్రవేశం చేసి, కూన రవికుమార్ మీద అప్పటి వరకు ఉన్న సాఫ్ట్‌కార్నర్‌ను చెరిపేశారు. అప్పటికే సౌమ్య వర్సెస్ కూన రవికుమార్ గొడవ కాస్త కాళింగ వర్సెస్ వెలమ కింద మారిపోయిన తర్వాత దువ్వాడ శ్రీను కాళింగులకు తాను మాత్రమే ప్రతినిధినైనట్లు అచ్చెన్నాయుడుతో పాటు ధర్మాన సోదరులు ఓ పథకం మేరకు కూన రవికుమార్‌కు మంత్రి పదవి రాకుండా చేస్తున్నారన్న కోణంలో ప్రెస్‌మీట్ ఇచ్చారు. వాస్తవానికి దువ్వాడ రంగప్రవేశం చేయనంత వరకు కూన రవికుమార్‌కు కులాలకు అతీతంగా మద్దతు లభించింది. ఆయన నియోజకవర్గంలో వెలమలు కూడా సోషల్‌మీడియాలో వచ్చిన ట్రోల్స్‌కు దూరంగా ఉన్నారు. కానీ దువ్వాడ శ్రీను ఇది కేవలం కాళింగులు, వెలమల సమస్యగానే చిత్రీకరించడంతో పాటు కూన రవికుమార్‌ను దువ్వాడ శ్రీను సర్టిఫై చేయడం వల్ల కూనకు అంతవరకు ప్రజల్లో ఉన్న సానుభూతి తగ్గిపోయింది. దివ్వెల మాధురితో నిత్యం రీల్స్, యూట్యూబ్ స్టూడియోలో ముద్దూముచ్చట్లు పెట్టుకునే దువ్వాడ శ్రీను వకాల్తా పుచ్చుకోవడంపై స్వయంగా కాళింగ సామాజికవర్గం నుంచే అంత వరకు మద్దతు తెలిపినవారి సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. రాజకీయంగా తన ప్రాబల్యం కులంలో తగ్గిపోతుందని భావించిన దువ్వాడ శ్రీను ఈ వ్యవహారంలో కాళింగులకు పెద్దన్నగా మారాలని చూశారు. కానీ అది తెలియకుండానే రవికి నష్టం చేకూర్చింది. వాస్తవానికి రవికి, దువ్వాడ శ్రీనుకు మధ్య అనుబంధం లేదు. ఆ మాటకొస్తే ఆ నియోజకవర్గంలో సీతారామ్‌తో దువ్వాడకు సత్సంబంధాలుండేవి. ఈ కథలో వెలమలను తెర మీదకు తేవడం కంటే ధర్మాన సోదరులను మరోసారి బహిరంగంగా తిట్టే అవకాశాన్ని వదులుకోవడం ఇష్టంలేకే దువ్వాడ ప్రెస్‌మీట్ పెట్టినట్టు కనిపిస్తుంది. కూన రవికి మంత్రి పదవి రాకుండా ధర్మాన ప్రసాదరావు అడ్డుకున్నారన్న ఆయన వాదనలో ఏమాత్రం పస కనిపించలేదు. అందుకు ఆయన ఆధారాలూ చూపించలేదు. దువ్వాడ లెక్క మేరకు తన సామాజికవర్గానికే చెందిన అచ్చెన్నాయుడు పదవిలో ఉండటమే ధర్మానకు ఇష్టమని ప్రజలకు చెప్పాలని చూశారు. కానీ ఎర్రన్నాయుడు 2012లో మరణించక ముందు నుంచే కింజరాపు కుటుంబంతో ధర్మానకు సంబంధాలు తెగిపోయాయి. కాకపోతే అచ్చెన్నాయుడి సోదరుడు హరివరప్రసాద్‌తో ధర్మానకు కొన్ని లింకులున్న మాట వాస్తవం. తాజాగా ధర్మాన మేనత్త ఇంటి నుంచి కింజరాపు ఇంటికి పిల్లనిచ్చిన మాటా వాస్తవం. అచ్చెన్నాయుడు, కూన రవిల్లో ఎవరికి మంత్రి పదవి ఇవ్వాలని అడిగితే కూన రవికే ధర్మాన మొగ్గు చూపుతారనేవారూ లేకపోలేదు. శత్రువుకు శత్రువుకు మనకు మిత్రుడన్న యుద్ధనీతి ధర్మాన ప్రసాదరావుకు తెలిసినంతగా ఈ జిల్లాలో మరొకరికి తెలియదు. ఒకే పార్టీలో ఉన్న తమ్మినేని సీతారామ్‌కు చెక్ పెట్టాలంటే ఆ నియోజకవర్గంలో కూన రవికుమార్‌కు బలం పెరగాల్సిన అవసరం ఉందని ధర్మాన భావించొచ్చు. రెండో కోణంలో తాను మంత్రి కానప్పుడు తన పక్క పార్టీలో ఎవరు మంత్రి అయినా, కాకపోయిన తనకొరిగేదేమీ లేదన్న భావనతో అందులో తలదూర్చే అవకాశం లేకపోలేదు. కానీ ఇందులోకి ధర్మాన సోదరులను తీసుకువచ్చి దువ్వాడ కాళింగులకు నాయకుడన్న పేరు తెచ్చుకోవాలని చూశారు. అదే నిజమైతే తన రాజకీయ జీవితం ప్రారంభించిన దగ్గర్నుంచి అనేక పార్టీల్లో ఎమ్మెల్యేగా పోటీ చేసిన దువ్వాడ శ్రీను తన సామాజికవర్గ ఓటర్లే ఎక్కువగా ఉన్న టెక్కలి నియోజకవర్గంలో ఎందుకు ఓడిపోతున్నారు? ఇక తాను మరోసారి రాష్ట్రమంత్రి అయినా, తనకు ఇన్నాళ్లు ప్రత్యర్థిగా వ్యవహరించిన దువ్వాడ శ్రీను మీద అచ్చెన్నాయుడు ఇప్పటి వరకు ఒక్క కేసు కూడా నమోదు చేయలేదు. రాష్ట్రవ్యాప్తంగా గత ప్రభుత్వ హయాంలో అగ్రెసివ్‌గా వ్యవహరించిన వైకాపా నేతలందర్నీ ఇప్పుడు కూటమి ప్రభుత్వం కటకటాల వెనక్కి నెడుతోంది. కానీ దువ్వాడ శ్రీను మాత్రం స్వేచ్ఛగానే రీల్స్ చేసుకుంటున్నారు. ఎందుకంటే.. ఆయన్ను అరెస్ట్ చేసి నియోజకవర్గంలో కాళింగులకు ఆయన్ను నాయకుడ్ని చేయడం అచ్చెన్నకు ఇష్టంలేదు. దీన్నే అచ్చెన్న, దువ్వాడ టైఅప్ అయ్యారన్నవారూ లేకపోలేదు. జిల్లాపరిషత్ ఎన్నికలు జరిగినప్పుడు రాష్ట్రమంత్రిగా, ఉపముఖ్యమంత్రిగా ఉన్న ధర్మాన కృష్ణదాస్ టెక్కలిలో దువ్వాడ శ్రీను ఇంటికి వెళ్లి మరీ భార్యభర్తలను తీసుకువచ్చి నామినేషన్ వేయించారు. ఇప్పుడు కృష్ణదాస్ ముసలినక్క అంటూ దువ్వాడ శ్రీను వ్యాఖ్యానించారు. వైకాపాలో జగన్మోహన్‌రెడ్డి శ్రీనుకు ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిసిన కృష్ణదాస్ గడిచిన వైకాపా పాలన మొత్తం శ్రీనును ముద్దుగానే చూసుకున్నారు. కానీ ఇప్పుడు కులానికి నాయకుడు కావాలన్న కోణంలో ఆయన ఎప్పటి మాదిరిగానే ధర్మాన సోదరుల మీద విమర్శనాస్త్రాలు ఎక్కుపెట్టారు. వాస్తవానికి సౌమ్య, కూన రవికుమార్ ఎపిసోడ్‌లో కులం కోణం లేదు. ఒకవేళ ఉందీ అంటే.. అది రవికుమార్ సొంత సామాజికవర్గానికి చెందిన ఏపీసీ శశిభూషణ్ తప్పిదం ఒక్కటే. రవికుమార్ ఇండియాలో లేని సమయంలో స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేశారన్న కథనాలు రావడంతో అమెరికాలో ఉన్న కూన రవికి ఏపీసీ ఇక్కడ జరగనివన్నీ జరిగినట్లు చెప్పడంతో అప్పటికే ముఖ్యమంత్రి ఆగ్రహించారన్న ఫ్రస్టేషన్‌లో ఉన్న కూన రవి విశాఖ ఎయిర్‌పోర్టులో దిగీ దిగగానే ఏపీసీ చెప్పిన మాటలు వీడియా ముందు వల్లెవేశారు. ఇక్కడే ఆయన తప్పటడుగు పడింది. దువ్వాడ శ్రీను దీనిని వెలమలకు, కాళింగులకు ముడిపెడితే, కూన సామాజికవర్గానికే చెందిన చింతాడ రవి కూన రవికుమార్ పరాయి మహిళల భుజంపై చెయ్యి వేసి ఫొటో తీసుకున్నారంటూ మరో అంశాన్ని తెరమీదకు తీసుకువచ్చారు. దీనికి కౌంటర్‌గా తిరుమల దర్శనానికి వెళ్లినప్పుడు వచ్చిన మహిళలందరూ తనతో తీయించుకున్న మహిళలందరి ఫొటోలను కూన రవికుమార్ రిలీజ్ చేయాల్సి వచ్చింది. దువ్వాడ శ్రీను మరో మహిళతో సహజీవనం చేసిన పుణ్యానికి ఇప్పుడు కూన రవి తనతో ఫొటోలో ఉన్నవారంతా అక్కాచెల్లెళ్లని చెప్పుకోవాల్సిన పరిస్థితి వచ్చింది.




• ఎడిటోరియల్

# కుర్ర మనసుల్లో క్రూర ఆలోచనలు!

టీవీలు, సెల్‌ఫోన్లు, కొన్ని సినిమాలు టీనేజర్ల మనసుల్లోకి ఎంతటి క్రూరత్వాన్ని చొప్పుస్తున్నాయో.. అవి ఎలాంటి అనర్థాలకు దారితీస్తున్నాయో చెప్పే తాజా ఉదాహరణ చిన్నారి సహస్ర దారుణ హత్యోదంతం. తన ప్రమేయం లేకుండానే పదేళ్లకే ఆ చిన్నారి జీవితం ముగిసిపోయింది. దీనికి కారకుడు ఒక టీనేజ్ కుర్రాడే కావడం విస్మయం కలిగిస్తోంది. ఈమధ్య కాలంలో టీవీల్లో వచ్చే క్రైమ్ కహానీలు, సెల్‌ఫోన్ల ద్వారా ఇంటర్‌నెట్‌లో ఉన్న నేర ఘటనలతో పాటు.. నేరాలు ఎలా చేయాలన్న సమాచారం చూసి తప్పుదోవ పడుతున్నారు. తల్లిదండ్రులు ఉద్యోగ వ్యాపకాల పేరుతో రోజులో ఎక్కువ భాగం తమ పిల్లలకు దూరంగా ఉంటూ కాలక్షేపానికి సెల్‌ఫోన్లు ఇచ్చేస్తున్నారు. అలా ఇళ్లలో ఒంటరిగా ఉండే పిల్లలు సెల్‌ఫోన్లు, టీవీల్లోని మంచి విషయాలను కాకుండా చెడు అంశాలకే ఎక్కువ ఆకర్షితులవుతున్నారన్నది మానసిక నిపుణులు చెబుతున్న మాట. ఖాళీగా ఉండే చిన్నారుల మెదళ్లు అవి చొప్పిస్తున్న విషపు ఆలోచనలతో నిండిపోయి క్రూరులుగా మార్చేస్తున్నాయి. నేరం ఎలా చేయాలి? దాన్నుంచి ఎలా తప్పించుకోవాలి? వంటివన్నీ యూట్యూబ్ వంటి వాటిలో ఉన్న వీడియోలు చూసి వాటినే ఆచరణలో పెడుతూ చిన్న వయసులోనే పెద్ద నేరగాళ్లుగా మారిపోతున్నారు. టీనేజ్ నుంచి యుక్తవయసులోకి అడుగుపెట్టే సంధి కాలంలో మనసు, మెదుడు పరిపరి విధాలుగా ఆలోచనలు చేస్తుంటాయి. చెడు విషయాలవైపే అవి మొగ్గు చూపుతుంటాయి. ఇటువంటి కీలక తరుణంలో పిల్లలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ, పరిశీలన కొరవడితే తెగిన గాలిపటంలో వారు తమ ఆలోచనల వెంట పరుగుతీస్తూ తప్పుడు మార్గంలోకి వెళ్లిపోతారు. తల్లిదండ్రులు గమనించేసరికే పరిస్థితి చేయి దాటిపోతుంది. సహస్ర హత్య వ్యవహారంలోనూ అదే జరిగింది. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లికి చెందిన సహస్రను ఆమె తల్లిదండ్రులు ఒంటరిగా ఇంట్లో ఉంచి ఉద్యోగాలకు వెళ్లిపోతుంటే.. ఆమెను హతమార్చిన కుర్రాడి పరిస్థితి కూడా అదే. పదో తరగతి చదువుతున్న ఆ కుర్రాడు సహస్ర అపార్ట్‌మెంట్‌కు పక్క బిల్డింగులోనే ఉంటున్నాడు. సరదాకో లేక జల్సాల కోసమో చోరీ చేయాలన్న ఆలోచన అతని బుర్రలో పుట్టింది. దానికోసం రకరకాల వీడియోలు చూసి ఆకళింపు చేసుకున్నాడు. పక్క అపార్ట్‌మెంటులో ఉన్న సహస్ర ఇంటి పరిస్థితిని కొన్నాళ్లు గమనించి.. ఆ ఫ్లాట్‌లోనే చోరీ చేయాలని నిర్ణయానికొచ్చాడు. స్టెప్ బై స్టెప్ ఏం చేయాలన్నది సొంతం కాగితంపై సవివరమైన స్క్రిప్ట్ కూడా రాసుకున్నాడంటే ఆ పిల్లాడు ఎంత గ్రౌండ్ వర్క్ చేశాడో అర్థం చేసుకోవచ్చు. ఆ స్క్రిప్ట్‌కు ఆపరేషన్ థెఫ్ట్ అని పేరు కూడా పెట్టాడు. తాళం కట్ చేయడానికి గ్యాస్ కట్టర్, కత్తి, వంటివి కూడా సమకూర్చుకుని ఆ ఫ్లాట్‌లోకి చొరబొడ్డాడు. అయితే అక్కడే అతగాడి ప్లాన్ బెడిసికొట్టింది. ఫ్లాట్‌లో ఒంటరిగా ఉన్న సహస్ర గమనించేసింది. అయినా టీనేజ్ చోరుడు ఏమాత్రం తొట్రుపాటుకు గురికాకపోగా.. అతని ఆలోచనలు పాదరసంలా మరింత వికృతంగా ఆలోచించాయి. చోరీ చేయాలనుకున్న అతన్ని ఏకంగా హంతకుడ్ని చేసేశాయి. ఆ చిన్నారి కేకలు వేసి చుట్టుపక్కలవారిని పోగేస్తే.. తన గుట్టు రట్టవుతుందని భయపడిన ఆ కుర్రాడు.. ఎదురుదాడికి తెగబడ్డాడు. సహస్రపై పడి తన వద్ద ఉన్న కత్తితో విచక్షణారహితంగా పోట్లు పొడిచారు. దాంతో ఆమె రక్తపు మడుగులో పడి కొట్టుకొని మరణించింది. ఆమె మెడపై 18, కడుపులో ఏడు బలమైన కత్తిపోట్లు ఉన్నాయంటే.. టీనేజ్ నిందితుడిలో ఎంత కసి ఉందో? ఆతనిలో ఎంత క్రూరత్వం పేరుకుపోయిందో వేరే చెప్పనక్కర్లేదు. ఇవన్నీ ఒక ఎత్తయితే.. అనుకోకుండా హత్యకు పాల్పడినా.. ఎక్కడా ఎలాంటి ఆధారాలు వదలకుండా పకడ్బందీగా వ్యవహరించడం మరో ఎత్తు. ఉదయం పది గంటల సమయంలో జనావాసాల్లోనే జరిగిన ఈ దారుణాన్ని ఎవరూ గమనించలేక పోయారు. మధ్యాహ్నం భోజనానికి బాలిక తండ్రి వచ్చిన తర్వాతే అది బయటపడింది. పోలీసులకు కూడా ఐదారోజుల పాటు ఒక్క క్లూ కూడా లభించకుండా ఈ కేసు ముప్పుతిప్పలు పెట్టింది. చుట్టుపక్కల సీసీటీవీల ఫుటేజీలను ఎన్నిసార్లు తిప్పితిప్పి చూసినా చిన్న ఆధారమైనా లభించలేదు. కానీ ఒక వర్క్ ఫ్రం హోంలో ఉన్న ఒక సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఇచ్చిన చిన్న క్లూతో ఎట్టకేలకు నిందితుడు పట్టుబడ్డాడు. ఈ హత్యకు పాల్పడింది ఒక టీనేజర్ తెలుసుకుని అవాక్కయ్యారు. ఒంటరితనం, ఇంటర్‌నెట్ వంటివి టీనేజర్లలో నేరప్రవృత్తి పెంచుతున్నాయనడానికి ఇదో ప్రబల తార్కాణం.

## తెలుగు తేజం పురస్కారానికి సంధ్య ఎంపిక

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



శ్రీకాకుళం జిల్లా కవిటి మండలం మాణిక్యపురం గ్రామానికి చెందిన యువ కవయిత్రి సాహు సంధ్య అంతర్జాతీయ సంస్థ శ్రీశ్రీ కళావేదిక అందించే "తెలుగు తేజం" అవార్డుకి ఎంపికయ్యారు. ఈ మేరకు సంస్థ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ శనివారం ఆహ్వానపత్రం అంద జేశారు. ఆగష్టు 31న పల్నాడు జిల్లా నరసరావుపేటలో నిర్వహించే తెలుగు భాషా దినోత్సవాల్లో ప్రముఖుల మీదుగా సంధ్య ఈ అవార్డు అందుకోనున్నారు. సంధ్య ఇటీవల కాలంలో రాస్తున్న కవితలు, కథలు సమాజ హితంగా ఉన్నాయని, అందుకే ఎంపిక చేశామని ప్రతాప్ తెలిపారు. ఈ పురస్కారానికి తనని ఎంపిక చేసిన చైర్మన్ కత్తిమండ ప్రతాప్, జాతీయ అధ్యక్షులు ఈశ్వరీ భూషణం, మీడియా ప్రతినిధి అమ్ము బమ్మిడి, ప్రధాన కార్యదర్శి పార్థసారథికి సంధ్య ధన్యవాదాలు తెలిపారు.

మండపాల ఏర్పాటుకు

## అనుమతులు తప్పనిసరి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఈ నెల 27న జరగనున్న వినాయక చవితి పండుగ సందర్భంగా జిల్లాలో ఏర్పాటు చేసుకొనే గణేష్ పందిళ్ళు, మండపాలు ఏర్పాటుకు తప్పనిసరిగా ఆన్లైన్‌లో అనుమతులు పొందాలని ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి తెలిపారు. గణేష్ ఉత్సవాలు నిర్వహించబోయే నిర్వాహకులు ముందుగా ఒక కమిటీగా ఏర్పడి, ప్రభుత్వం ప్రవేశపెట్టిన సింగిల్ విండో విధానంతో https://ganeshutsav.net క్లిక్ చేసి, నిర్దేశించిన అనుమతులు పొందాలన్నారు. సింగిల్ విండో విధానంతో ప్రజలు సులభంగా గణేష్ ఉత్సవాల నిర్వహణ, మండపాల ఏర్పాటు, ఊరేగింపులు, నిమజ్జనంకు అనుమతులు పొందవచ్చునని ఎస్పీ తెలిపారు. మండపాల ఏర్పాటుకు ఎటువంటి చలనాలు చెల్లించనవసరం లేదని ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి స్పష్టం చేసారు. గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా ఎటువంటి అల్లర్లు, ఘర్షణలకు తావులేకుండా నిర్వహించు కోవడానికి, ఇప్పటికే పోలీసు శాఖ జారీ చేసిన నియమ నిబంధనలు తూచా తప్పకుండా పాటించి పోలీసు శాఖకు ప్రజలందరూ సహకరించాలన్నారు.

## స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యం ప్రతి ఒక్కరిది కావాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ లక్ష్యం ప్రతి ఒక్కరిదీ కావాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని డీసీసీబీ కాలనీ పరిసరాలలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ దేశంలోనే ఆంధ్రప్రదేశ్ ను పరిశుభ్రమైన రాష్ట్రాల్లో నెంబర్‌వన్‌గా నిలపాలని లక్ష్యంతో సీఎం చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారన్నారు. అందులో భాగంగానే నెలలో మూడో శనివారం రాష్ట్రవ్యాప్తంగా స్వచ్ఛ్ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని వివరించారు. నెలకి ఒకటి చొప్పున 12నెలలకు 12థీమ్‌లతో ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమాలను అన్ని నివాసిత ప్రాంతాలు, గ్రామా పంచాయితీలు, మున్సిపాలిటీలు, పాఠశాలలు, ఆస్పత్రులు, బస్టాపులు, రైల్వే స్టేషన్లు, పరిశ్రమలు తదితర ప్రభుత్వ, ప్రైవేటు సెక్టార్లలో పరిశుభ్రత కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్న స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు అంకితభావంతో భాగ్యస్వాములు కావాలన్నారు. ప్రధానంగా పర్యావరణాన్ని పరిరక్షించడం, పరిశుభ్రమైన వాతావరణాన్ని నెలకొల్పడం, ప్రజారోగ్య పరిరక్షణ, పర్యావరణంపై కాలుష్య ప్రభావాన్ని తగ్గించడం, పర్యాటకులు, యాత్రికులు, పెట్టుబడిదారులను ఆహ్వానించే రీతిలో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించడం, ఆర్థిక ప్రయోజనాలను మెరుగుపరచడం, పిల్లలు, భవిష్యత్తు తరాల వారికి పర్యావరణ పరిశుభ్రతపై అవగాహన కల్పించడం అనే లక్ష్యాలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అన్ని గ్రామాలలో పెద్దఎత్తున పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టి రోడ్లు, చెత్తకుప్పలు, బోరుబావులు, కుంటలు, చెరువులు, కాలువలలోని వ్యర్థ పదార్థాలను తొలగించడంతోపాటు మెగా శుభ్రత డ్రైవ్‌లు నిర్వహించాలన్నారు. అనంతరం స్వచ్ఛందంగా స్వచ్ఛదివస్ కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు నగర కార్పొరేషన్ కమిషనర్, హెల్త్ ఆఫీసర్, సచివాలయ సిబ్బంది, కాలనీ ఇన్చార్జిలు, టిడిపి నగర అధ్యక్ష బృందం, నాయకులు కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## విద్యార్థిదశ నుండే పోటీ పరీక్షలకు సిద్ధం కావాలి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రతీ విద్యార్థి విద్యార్థిదశ నుండే పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని, జేసీఐ శ్రీకాకుళం సన్‌రైజర్స్ అధ్యక్షులు ప్రవీణ్ కుమార్ సింగూరు శనివారం అన్నారు. జూనియర్ ఛాంబర్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో శ్రీకాకుళం జిల్లాలో శనివారం పోటీ పరీక్షలను వెన్నెల వలస నవోదయ పాఠశాల, కేజీబీవీ పొన్నాడ, కేజీబీవీ ఆమదాలవలస, కేజీబీవీ సింగపురం, జడ్పీహెచ్ పాఠశాల కేశవరావుపేట, మోడల్ స్కూల్ తామాడ, వినోద్‌కుమార్ క్లినిక్ ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీఐ శ్రీకాకుళం సన్‌రైజర్స్ అధ్యక్షులు ప్రవీణ్‌కుమార్ సింగూరు మాట్లాడుతూ విద్యార్థులలో నైపుణ్యాన్ని వెలికితీసి, వారి ఉన్నత చదువులకు ప్రోత్సాహించటం కోసమే ఈ పోటీ పరీక్షలను నిర్వహించామన్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు బాసటగా నిలిస్తే, రానున్న కాలంలో ఉన్నత చదువులు చదువుతూ, సుస్థిర స్థానం సంపాదిస్తారని, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతారని, అన్ని రకాల ప్రభుత్వ కొలువులకు ఈ పోటీ పరీక్షలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. జేసీఐ ప్రత్యేకంగా యువతకు, విద్యార్థులకు నిశానిర్దేశం చేస్తూ, నాయకత్వ లక్షణాలను మెరుగుపరచడంలో సహాయపడతారని, తద్వారా విద్యార్థులు నిర్దేశ గమ్యానికి సునాయాసంగా చేరుకుంటారన్నారు. జేసీ సాట్ స్కాలర్షిప్, ఆప్టిట్యూడ్ పరీక్షలు ద్వారా విద్యార్థులు ఆలోచనా విధానంతోపాటు, తక్కువ సమయంలో జవాబులు రాసే అవున్నత్యాన్ని అలవర్చుకుని ప్రథమస్థానంలో నిలుస్తారన్నారు. పోటీ పరీక్షలలో ప్రతిభకనబరిచిన వారికి నగదు బహుమతులు సెప్టెంబర్‌లో అందజేస్తామని, నగరంలో జేసీఐ శ్రీకాకుళం సన్‌రైజర్స్ ఆధ్వర్యంలో అవగాహనా కార్యక్రమాలతోపాటు, యువతకు, విద్యార్థులను చైతన్యపరుస్తామన్నారు. అనంతరం పోటీ పరీక్షలలో పాల్గొన్న విద్యార్థులకు అతిథులచే ప్రశంసాపత్రాలను అందించారు. ఈ పోటీపరీక్ష నిర్వహణలో జేసీ డాక్టర్ వినోద్ కుమార్ కూర్మాన, జోన్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ బగాది, వైస్ ప్రెసిడెంట్ జగదీష్, చార్టెడ్ ప్రెసిడెంట్ సంతోష్ దూసి, దామోదర్, సుధాకర్, ఉమామహేష్, దీప, పాఠశాలల అధ్యాపక బృందం, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



భారతీయ సినీ రంగం ఒక కొత్త దశలోకి ప్రవేశిస్తోంది. మహావతార్ నరసింహ ఘనవిజయం సాధించిన తరువాత, ప్రొడ్యూసర్లు మైథాలజీని "పాన్ ఇండియా గోల్డ్‌మైన్"గా చూస్తున్నారు. ఈ తరంగంలో భాగంగా అబున్‌దాన్షియా ఎంటర్‌టైన్‌మెంట్, కలెక్టివ్ మీడియా నెట్‌వర్క్ కలిసి చిరంజీవి హనుమాన్.. ది ఎటర్నల్ అనే పూర్తిగా ఏఐ ఆధారిత యానిమేషన్ ఫిల్మ్‌ను ప్రకటించారు. ఈ చిత్రం 2026 హనుమాన్ జయంతిన రిలీజ్ కానుంది. లార్డ్ హనుమాన్ లెజెండ్‌ను 100% ఏఐ జనరేటెడ్ రూపంలో స్క్రిప్ట్ నుంచి విజువల్స్ వరకు పూర్తి చేయడం ఇదే మొదటిసారి.

- జోశ్యుల సూర్యప్రకాశ్

# సినిమా ఏఐతో.. చిరంజీవి హనుమాన్!

### మైనస్ పాయింట్స్: ఏఐ తీసుకొచ్చే సమస్యలు

**మానవ భావోద్వేగాలు అంతగా పండవు:** మైథాలజీ కేవలం స్పెక్టకిల్ కాదు– అది భక్తి, భావన, సంస్కారం. ఒక అల్గోరిథమ్ ప్రహ్లాదుడి కన్నీళ్లను నిజంగా చూపగలదా? ఒక సీనియర్ డైరెక్టర్ మాటల్లో: "పిక్సెల్‌కి భక్తి రాదు." ఏదో ఒకటి వర్కవుట్ అయ్యినంత మాత్రాన అన్ని కలిసి రావు. **కళాకారుల ఉపాధి సంక్షోభం:** రచయితలు, యానిమేటర్లు, టెక్నీషియన్లు వేలమంది ఉద్యోగాలు కోల్పోతారని భయం. హాలీవుడ్‌లో కూడా ఇదే ఆందోళనతో రైటర్స్ స్ట్రైక్ జరిగింది. **ఓవర్-సాచ్యురేషన్ రిస్క్:** 90వ దశకంలో మైథాలజీ సీరియల్స్ ఎక్కువగా రావడం వల్ల వాటి ఇంపాక్ట్ తగ్గినట్లే, ఏఐ వల్ల తరుచుగా మైథాలజీ సినిమాలు వస్తే ప్రత్యేకత పోతుంది. కొన్నాళ్లకి బోర్ కొట్టేస్తుంది. టీవీల్లో యానిమేషన్ సీరియల్లు చూసినట్లు ఉంటుంది. **ఎథికల్ & కల్చరల్ ఆటెంటిసిటీ:** ఏఐ డేటా సెట్‌ల నుండి నేర్చుకుంటుంది. తప్పు సమాచారం లేదా పాశ్చాత్య దృక్కోణాలు కూడా రిజల్ట్‌లో రావచ్చు. ఎందుకంటే మైథాలజీ కేవలం కంటెంట్ కాదు, అది పవిత్రమైన సంప్రదాయాలతో కూడిన కథలు, గాథలు. **గ్లోబల్ కోణం:** హాలీవుడ్‌లో ఇప్పటికే ఏఐ స్క్రిప్టింగ్, సీజీఐ టెస్టులు జరిగాయి. జపాన్ యానిమేషన్‌లో కూడా ఏఐ ప్రయోగాలు మొదలయ్యాయి. కానీ చిరంజీవి హనుమాన్ మాత్రం పూర్తిగా ఏఐ ఆధారంగా తీస్తున్న మొదటి మైథాలజికల్ ఫీచర్ ఫిల్మ్. విజయం సాధిస్తే ఇది ప్రపంచ వ్యాప్తంగా ఏఐ కల్చరల్ సినిమాలకి ద్వారం తెరుస్తుంది. విఫలమైతే "మైథాలజీ+మెషిన్" కలయిక సరిపోదు అనే హెచ్చరికగా గుర్తుండిపోతుంది. **ఫైనల్ థాట్:** మైథాలజీ అనేది కేవలం కథ కాదు. అది భక్తి, సంస్కృతి, భావోద్వేగాల సమ్మేళనం. ఏఐ ఈ కథలను మరింత గొప్ప విజువల్స్‌తో, తక్కువ ఖర్చుతో అందించగలదు. కానీ అదే సమయంలో, మనుషుల సృజనాత్మకత, ఆత్మీయత, భావోద్వేగం లేకపోతే, అది కేవలం డిజిటల్ ప్రదర్శనగానే మిగిలిపోతుంది. "మైథాలజీకి మెషిన్ తోడ్పడాలి. భర్తీ చేయకూడదు. ఏదైమైనా స్టీవెన్ స్పీల్బర్గ్ చెప్పినట్లు..."టెక్నాలజీ టూల్స్ ఇస్తుంది కానీ ఆత్మను ఇవ్వదు." అనేది మాత్రం ఇక్కడ మర్చిపోకూడదు.

కానీ ఇప్పుడు సినిమావారి మనస్సులో ఉదయిస్తున్న ప్రశ్న ఏమిటంటే "మహావతార్ నరసింహ విజయం భక్తుల గర్జన అయితే, చిరంజీవి హనుమాన్ ఆ గర్జనను ఏఐ ప్రతిధ్వనిగా నిలబెడుతుందా? లేక కేవలం డిజిటల్ శబ్దంగా మిగులుస్తుందా?" అనేది ఇప్పుడు అంతటా ఆలోచనలో పడేస్తున్న ప్రశ్న. ఇక ఏఐ సినిమాలపై ఇప్పటికే బాలీవుడ్ స్టార్ డైరెక్టర్ అనురాగ్ కశ్యప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏఐ టెక్నాలజీతో ఎమోషన్స్ పండించలేము. కేవలం మనుషుల ద్వారా మాత్రమే ఎమోషన్స్ పండుతాయి. చాలా మంది తక్కువ ఖర్చు అవుతుందనే ఉద్దేశంతో ఇలా ఏఐ టెక్నాలజీని వాడి ప్రాణం లేని బొమ్మలను క్రియేట్ చేసి సినిమాలు తీసేసి ప్రేక్షకులను మోసం చేద్దాం అనుకుంటున్నారు అంటూ మండిపడ్డారు. అంతేకాదు ఏఐ టెక్నాలజీతో రాబోతున్న చిరంజీవి హనుమాన్ మూవీ యూనిట్ పై కూడా ఆయన ఫైర్ అయ్యారు.

ఈ క్రమంలో ఏఐ సినిమాల వల్ల మైథాలజీకు ఏ మేరకు ప్లస్ అవుతుంది, ఎంత మేరకు నష్టం అవుతుంది. ఇది కలిసొచ్చే ప్రయత్నమేనా చూద్దాం. "సినిమా అంటే మనం ఏమి చూపిస్తామన్నది కాదు, ప్రేక్షకుడు ఏమి ఫీలవుతాడన్నది." : రాజ్‌కుమార్ హిరానీ (ఇదే ఏఐ డిబేట్‌లో కేంద్రబిందువుగా మారింది.)

### ప్లస్ పాయింట్స్: ఏఐ మైథాలజీకి చేసే ఉపయోగాలు

**తక్కువ ఖర్చుతో భారీ విజన్**

సెట్‌లు, వేల ఎక్స్‌ట్రాలు, భారీ విఎఫ్ఎక్స్ లాంటి వాటికి వందల కోట్లు ఖర్చు అవుతుంది. ఏఐ వల్ల ఈ ఖర్చు బాగా తగ్గుతుంది. ఒక ట్రేడ్ అనలిస్ట్ మాటల్లో: "ఒక రాజ్యం నిర్మించడానికి రూ.500 కోట్లు ఖర్చు పెట్టాల్సిన పనిలేదు, ఒక అల్గోరిథమ్ ఒక్క రాత్రిలో క్రియేట్ చేస్తుంది."

**స్పీడ్ & ఎక్స్‌పెరిమెంటేషన్**

డైరెక్టర్స్, ప్రొడ్యూసర్లు కొన్ని రోజుల్లోనే వందల స్క్రిప్ట్‌లు, విజువల్ స్టైల్‌లు టెస్ట్ చేసుకోవచ్చు.

**గ్లోబల్ రీచ్:**

ఏఐ సులభంగా భాషా అనువాదం, డబ్బింగ్, సబ్‌టైటిల్స్ చేస్తుంది. దీనివల్ల మైథాలజీ మార్వెల్ లాంటి గ్లోబల్ లెవెల్‌కి వెళ్ళే అవకాశం ఉంది.

**కల్చరల్ ప్రిజర్వేషన్**

అమర్ చిత్ర కథ 20వ శతాబ్దంలో మైథాలజీని





- నిర్లక్ష్యానికి నిలువెత్తు రూపం కేబుల్ కనెక్షన్లు
- విద్యుత్ స్తంభాలపై కట్టలు కట్టలు
- రోడ్లపై తెగి పడినా పట్టించుకోని ఆపరేటర్లు
- మెడకు చుట్టు కుంటున్న వైర్లు

# ఇక్కడ ఎవ్వరికీ బాధ్యత లేదు!



**ఇటీవల తెలంగాణలో రేవంత్ సర్కార్ చేపట్టిన విద్యుత్ లైన్ల దిద్దుబాటులో భాగంగా కేబుల్ వైర్లను కట్ చేస్తే నెట్ డిస్‌కనెక్ట్ అయిందని ఒకరు, కావాలనే ఇంటర్నెట్ కేబుల్స్ తొలగిస్తున్నారని ఇంకొకరు, ముందస్తు నోటీసు ఇవ్వలేదని మరొకరు విమర్శించారు. విద్యుత్ శాఖ, కాంగ్రెస్ సర్కారుపై వేలాదిమంది నెటిజన్లు సోషల్ మీడియా వేదికగా మండిపడ్డారు. అయితే ప్రస్తుతం కరెంట్ పోల్స్‌పై వేలాడుతున్న ఇంటర్నెట్ వైర్లు, కేబుల్ కనెక్షన్ల కట్టలు చూస్తే అక్కడి ప్రభుత్వం, విద్యుత్ శాఖ చేసిన పని తప్పకాదని కచ్చితంగా చెప్పొచ్చు. రామంతా పూర్‌లో ఆదివారం రాత్రి శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో కేబుల్ కారణంగా రథానికి కరెంట్ షాక్ తగిలి ఐదుగురు చనిపోయిన విషయం విదితమే. మొన్న భారీ వర్షాల సమయం.. తెలంగాణలోని సూర్యాపేటలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మూత్రం పోసిన ఓ వ్యక్తి విద్యుత్ షాక్‌కు గురై చనిపోయాడు.**

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

కొద్ది రోజుల క్రితం పాతశ్రీకాకుళం ప్రాంతంలో సిరిమానోత్సవం జరిగింది. ఈ సందర్భంగా సిరిమాను ఆ ప్రాంతంలో తిరగడానికి విద్యుత్ వైర్లను సరిచేయాలని స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్‌ను కమిటీ సభ్యులు కోరారు. దీనికి అనుగుణంగా కరెంటు స్తంభాలను పద్ధతిగా ఓవైపునకు మార్చి రోడ్డుకు మధ్యలో కరెంటు తీగలు వెళ్లకుండా లక్షలు ఖర్చుపెట్టి పనులు పూర్తిచేశారు. కానీ సిరిమాను వెళ్లడానికి స్థానిక సంతోషిమాత కోవెల వద్ద ఇబ్బంది ఎదురైంది. విద్యుత్ లైన్‌మేన్‌లు, ఇద్దరు ఏఈలు స్వయంగా పర్యవేక్షించిన ఈ సిరిమాను సంబరంలో సిరిమాను నిలిచిపోవడమేమిటా అని ఆరా తీస్తే రోడ్డుకు అడ్డంగా కరెంటు పోల్లను ఆసరాగా తీసుకొని నెట్ కేబుళ్లు, ఫైబర్ కేబుళ్లు ఉన్నాయి. విద్యుత్ సిబ్బంది పోల్స్ మార్చిన సందర్భంగా కేబుళ్లను తొలగించాలని ఎన్నిసార్లు విన్నవించినా సంబంధిత కేబుల్ ఆపరేటర్లు దీన్ని పట్టించుకోలేదు. చివరకు సంబరం రోజున ఈ ఫైబర్ కేబుళ్లను ముక్కముక్కలుగా తెగ్గొట్టాల్సి వచ్చింది. ఇది కేవలం నగరంలో విద్యుత్ స్తంభాలకు వేలాడుతున్న ఫైబర్ కేబుళ్లకు సంబంధించిన ఒక ఉదాహరణ మాత్రమే. ఇది కాకుండా ఏ సందులో ఇల్లు మారి పక్క వీధికి వెళ్లినా సామాన్లు లారీ మీద తరలించాల్సివస్తే.. ఈ కేబుళ్లను పైకి ఎత్తి, వాహనాల్ని నడపాల్సిన పరిస్థితి. కేబుల్‌ను పోల్‌కు పోల్‌కు మధ్యలో టైట్‌గా బిగిస్తే గాలికి తెగిపోతుందని, ఊగేటంత లూజుగా వీటిని అమరుస్తున్నారు. దీంతో పాటు పోల్ మీద భవిష్యత్ అవసరాల కోసం లూప్‌ను ఉంచుతున్నారు. ఇది కూడా కొన్ని వందల మీటర్లు ఉండటం వల్ల చాలాచోట్ల ఫైబర్ కేబుళ్లు తలంత ఎత్తులో వేలాడుతున్నాయి. మరికొన్నయితే నడుస్తుంటే కాళ్లకు అడ్డం తగులుతున్నాయి. జిల్లాలో కేబుల్ టీవీ ఆపరేటర్లు విపరీతంగా పెరిగారు. అలాగే ఇంటర్నెట్ అందించే సంస్థలూ ఎక్కువగానే ఉన్నాయి. వీటన్నింటి కేబుళ్లు ప్రతీ పోల్ మీద కట్టలు కట్టలుగా వేళాడుతున్నాయి. పొరపాటున విద్యుత్ స్తంభం మీద కరెంట్ సర్వీస్ ప్రాబ్లం వస్తే పోల్ ఎక్కి సర్వీస్ చేయడానికి కూడా అవకాశం లేనంతగా ఫైబర్ కేబుళ్లతో చుట్టేస్తున్నారు. గతంలో తమ పోల్‌ను వాడుకున్నందుకు విద్యుత్ శాఖ నగరంలో రూ.100, రూరల్‌లో రూ.75 చొప్పున నెలకు వసూలు చేసేది. కానీ ఇది కూడా ఓ స్వయం ఉపాధి యూనిట్టేనని పోల్‌కు రూ.100 ఛార్జీని మినహాయించాలని రాష్ట్రవ్యాప్తంగా విన్నపాలు రావడంతో ఇటీవల దీన్ని రద్దు చేశారు. స్థానికంగా ఉన్న నెట్‌వర్క్‌లతో పాటు కార్పొరేట్ కంపెనీల ఫైబర్‌నెట్‌లు కూడా వచ్చేయడంతో ప్రతీ విద్యుత్ స్తంభం మీద వైర్లు వేళాడుతున్నాయి. కొన్నయితే ట్రాన్స్‌ఫార్మర్‌కు టచ్ అవుతున్నాయి. అది కూడా స్కూల్ జోన్‌లో ఉన్నాయి.

**నెట్‌వర్క్.. ఇప్పుడు ప్రతి ఇంటికి అవసరమే. అది టీవీ, లేదా ఇంటర్నెట్ కావచ్చు. ఇందులో ఇంటికో రకం నెట్‌వర్క్. ఇప్పుడంతా ఇంటర్నెట్‌మయం. ఇళ్లలో ఓటీటీలు, డిష్‌లు కూడా నెట్‌తోనే నడుస్తున్నాయి. ఇవన్నీ వెరసి విద్యుత్ స్తంభాలపై కట్టలు కట్టలుగా కేబుల్ వైర్లు. కనీసం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగినప్పుడు లైన్‌మేన్‌కు పూర్తిగా వీలుకాని పరిస్థితి.**

ఒకప్పుడు పట్టణమంతా ఒకటో రెండో నెట్‌వర్క్‌లు.. అందులో ఏరియాకు ఒక ఆపరేటరు ఉండేవారు. ఇప్పుడు వినియోగదారులు ఒకరు ఎయిర్‌టెల్, మరొకరు జియో, ఇంకొకరు బీఎస్ఎన్ఎల్.. అలాగే లోకల్ కేబుల్ కనెక్షన్లు.. ఇలా ఎన్నో రకాలు. వీటిలో జియో తప్ప బీఎస్ఎన్ఎల్‌తో సహా మిగిలినవన్నీ వీధుల్లో కనిపించిన విద్యుత్ పోల్‌ను ఆధారం చేసుకొని నడిపేస్తున్నాయి. ఇందులోనూ ఒక ఏరియా ఆపరేటరు ఇంకో ఏరియాలో వేరే నెట్‌వర్క్ వైర్లను రాత్రికి రాత్రే కట్ చేసిపడేస్తున్న సందర్భాలు ఇప్పుడు అనేకం. దీంతో అవి రోడ్డు మధ్యలో వేలాడుతూ ఉంటాయి. **వాహనాలను నడిపేవారు ఎంత అలర్ట్‌గా ఉన్నా ఈ తెగిన కేబుల్ వైర్ల కారణంగా ప్రమాదాలకు గురవుతున్నారు. కొన్నిసార్లు ద్విచక్ర వాహనదారుల మెడకు చుట్టుకున్న సందర్భాలూ లేకపోలేదు.** కేబుల్ ఆపరేటర్లు ఇష్టం వచ్చినట్లు రోడ్డుకు అటూ ఇటూ కేబుల్ కనెక్షన్లు వేసేస్తుండటంతో వాటి కారణంగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. కనీస ఎత్తు పాటించకుండా ఎదురుగా కనిపించే పోల్స్ అన్నిటికీ కట్టలు కట్టలుగా కేబుల్ వైర్లు కట్టేస్తున్నారు. **ముఖ్యంగా పోల్స్‌పై విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినప్పుడు లైన్‌మెన్లు పడే ఇబ్బంది అంతా ఇంతా కాదు.** ఇక కొన్నిచోట్ల విద్యుత్ ట్రాన్స్‌ఫారమ్ నుంచి పక్కనున్న పోల్స్‌కు వచ్చే కనెక్షన్ల మధ్య నుంచి కేబుల్ కట్టలు వదిలేస్తుండటంతో కింద వేలాడుతున్న వైర్ల ద్వారా విద్యుత్ సరఫరా జరుగుతున్న సందర్భాలూ ఉన్నాయి. వర్షాల సమయంలో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫారమ్‌ల దగ్గర నుంచి వెళ్లవద్దని అధికారులు, ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేస్తోంది. అంతవరకు బాగానే ఉన్నా తెగిపడిన కేబుల్ వైర్ల నుంచి విద్యుత్ ప్రసరణ జరిగి షాకిస్తున్నాయి. ఇక వినియోగదారుడు తనకు నెట్‌వర్క్ రావడంలేదని చెబితే వచ్చి కనెక్షనిచ్చి, కట్ చేసిన వైర్లు అలాగే రోడ్డుపై పడేసి వెళ్లిపోతున్నారు. కట్ చేసిన వైరు చిన్నది అయినా ఫర్వాలేదు గానీ, కనీసం ఐదు మీటర్ల పైబడి వైరు రోడ్డుపై నిర్లక్ష్యంగా వదిలేయడం అందరికీ తెలిసిందే. దీనిపై ఎవ్వరికీ పట్టదు.. అధికారులు హెచ్చరించరు.. చర్యలు తీసుకోరు.





---

- **ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన భారతదేశం వీధి కుక్కల దెబ్బకు ఇప్పుడు రెండుగా చీలిపోయి ఉంది. ఢిల్లీలో వీధి కుక్కలు కరచి చిన్నారులు చనిపోయిన నేపథ్యంలో భారత సర్వోన్నత న్యాయస్థానం కలుగజేసుకుని ఢిల్లీ వీధుల్లో కుక్కలు కనిపించాయా.. ఖబడ్దార్! అని శునక నిర్మూలన మహా యజ్ఞానికి ఆదేశాల హవిస్సులు ఇచ్చింది. దాంతో రాహుల్ గాంధీ మొదలు అనేకమంది సెలెబ్రిటీలైన జంతు ప్రేమికులు సుప్రీం కోర్టు తన నిర్ణయాన్ని పునః సమీక్షించుకోవాలని కోరుతూ సరికొత్త ఉద్యమానికి ఊపిరులూదారు.**
- **దేశవ్యాప్తంగా ప్రతి 11 సెకెన్లకు ఒక కుక్కకాటు కేసు నమోదవుతోంది. 2022లో దేశంలో కుక్కకాటు సంఘటనలు 22 లక్షలు, 2024లో 37 లక్షలు. 2024లో కుక్కకాటు కేసులు ఉత్తరాదితో పోలిస్తే దక్షిణాదిలో బాగా పెరిగాయి. దేశంలో 6కోట్లకు పైగా వీధి కుక్కలున్నాయి. కుక్కల ద్వారా దాదాపు 60 రకాల వ్యాధులు మనుషులకు వచ్చే ప్రమాదముంది.**

# దేశమంటే మనుషులా? కుక్కలా?






## వీధి కుక్కలు కనిపించకూడదు

Courtesy: Namaste Telangana

- అన్నింటిని పట్టుకుని స్టెరిలైజ్ చేసి షెల్టర్లకు తరలించండి
- ఢిల్లీ, ఎన్‌సీఆర్ అధికారులకు సుప్రీంకోర్టు కీలక ఆదేశం
- అడ్డుకునే వారిపై కఠిన చర్యలు తప్పవని ధర్మాసనం హెచ్చరిక

న్యూఢిల్లీ, ఆగస్టు 11: ఢిల్లీ వీధుల్లో కుక్కలు కనిపించరాదని సుప్రీంకోర్టు సోమవారం ఢిల్లీ ప్రభుత్వ అధికారులను ఆదేశించింది. వీధి కుక్కలన్నిటినీ సాధ్యమైనంత త్వరితంగా స్టెరిలైజ్ చేసి షెల్టర్లకు తరలించాలని సుప్రీంకోర్టు ఢిల్లీ-ఎన్‌సీఆర్ అధికారులను ఆదేశించింది. వీధి కుక్కల కాటు వల్ల రేబీస్ వ్యాధి వ్యాప్తి చెందుతోందని, ముఖ్యంగా పిల్లలు దీనికి గురవుతుండడంతో పరిస్థితి చాలా దయనీయంగా ఉందని సుప్రీంకోర్టు పేర్కొంది. వెంటనే వీధి కుక్కల కోసం షెల్టర్లు ఏర్పాటు చేయాలని కోర్టు ఆదేశించింది. దాదాపు 5,000 వీధి కుక్కల కోసం 6 నుంచి 8 వారాలలో షెల్టర్లు ఏర్పాటు చేయాలని అధికారులకు సుప్రీం కోర్టు స్పష్టంచేసింది. తమ ఆదేశాలకు అవరోధాలు కల్పించడానికి వ్యక్తులు కాని, సంస్థలు కాని ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జస్టిస్ పార్దీవాలా, జస్టిస్ ఆర్ మహదేవన్‌తో కూడిన ధర్మాసనం హెచ్చరించింది. అవసరమైతే కోర్టు ధిక్కరణ ప్రక్రియ చేపడతామని కూడా ధర్మాసనం హెచ్చరించింది. వీధి కుక్కలను పట్టుకోవడానికి వచ్చే సిబ్బందిని ఎవరైనా అడ్డుకుంటే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపింది.

ఆ పిల్లల ప్రాణాలను తిరిగి తేగలరా?

రేబీస్ వ్యాధితో మరణించిన పిల్లల ప్రాణాలను జంతు ప్రేమికులమని చెప్పుకుంటున్న వారు తిరిగి తీసుకురాగలరా అని ధర్మాసనం ప్రశ్నించింది. పరిస్థితిని బట్టి చర్యలు తీసుకోవలసిందేనని స్పష్టం చేసింది. దేశ రాజధానిలో వీధి కుక్కల కాట్ల వల్ల రేబీస్ సోకుతున్న ఘటనలు పెరుగుతుండడంపై జులై 28న చేపట్టిన సుమోటో కేసుపై ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. అన్ని వీధి కుక్కలను తొలగించి షెల్టర్లలో ఉంచాలని ఢిల్లీ ప్రభుత్వంతోపాటు గురుగ్రామ్, నోయిడా, ఘజియాబాద్ మున్సిపల్ అధికారులను ధర్మాసనం ఆదేశించింది. ప్రజల విశాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని తాము ఈ ఆదేశాలు జారీచేస్తున్నట్లు స్పష్టం చేసింది. ఈవిషయంలో ఎటువంటి మనోభావాలు ఉండరాదని కూడా సూచించింది. రేబీస్‌కి దారితీసే కుక్క కాట్లకు శిశువులు, పిల్లలు బలికారాదని, ఈ చర్య వల్ల తాము స్వేచ్ఛగా రోడ్లపై తిరగవచ్చన్న విశ్వాసాన్ని పిల్లలు, వృద్ధులలో కలిగించవచ్చని ధర్మాసనం తెలిపింది. కేసు తదుపరి విచారణను ఆరు వారాలకు వాయిదా వేసింది. సుప్రీంకోర్టు తీర్పును జంతు ప్రేమికులు వ్యతిరేకించారు.

**వాల్మీకి రామాయణం ఉత్తరకాండలో ఒక భిక్షువు-కుక్క సంవాదం సందర్భంలో రాజు శిక్షించడం వల్ల పాపం పోతుందని ఒక ధర్మసూక్ష్మ విశ్లేషణ ఉంటుంది. ఒక భిక్షువు వీధిలో తన మానాన తనున్న ఒక కుక్కను అకారణంగా కొడతాడు. రక్తం కారుతూ ఆ కుక్క న్యాయం కోసం అయోధ్యలో రాముడి అంతఃపురంలో ప్రజల వినతులు వినే చోటుకు వెళ్లి పంచాయితీ పెడుతుంది.**

అకారణంగా కొట్టిన మాట నిజమే అని భిక్షువు నేరాన్ని అంగీకరించినా.. చిన్న పిల్లలు, మహిళలు, వృద్ధులు, వికలాంగులు, సన్యాసులు చేసిన మొదటి తప్పును మన్నించాలని న్యాయపరిషత్ ఇప్పటి భాషలో కోర్టు ఫుల్ బెంచ్ అభిప్రాయ పడింది. చేసిన నేరాన్ని అంగీకరించావు, భిక్షువు కాబట్టి మొదటి తప్పుగా పరిగణించి వదిలేస్తున్నాం.. జాగ్రత్త.. ఇకపై సంయమనంతో ఉండు.. పో.. అంటాడు రాముడు. 'రామ! రామ! నాకు శిక్ష వేయకపోతే నీ మీద పాలనా దోషం పడుతుంది. పైగా నేను శిక్ష అనుభవించడం వల్ల నా పాపం పోతుంది' అని భిక్షువు ప్రాధేయపడతాడు. ఏ శిక్ష వేద్దాం? అని రాముడు కుక్కనే అడిగాడు. అయోధ్యలో ఏదైనా గుడికి ధర్మకర్తగా వేయండి స్వామీ.. అని కుక్క విన్నవించుకుంది. రాముడు అలాగే చేశాడు.

(గుడికి ధర్మకర్త అంటే గొప్ప వరం కదా? శిక్ష ఎలా అవుతుంది? అని అనుకుంటాం. అక్కడ కుక్కగా ఉన్నది గత జన్మలో ధర్మకర్త హోదాలో గుడి నిర్వహణ వెలగబెట్టిన మనిషే. ఆ విషయం ఆ కుక్కకు తెలుసు. రాముడికి తెలుసు. వాల్మీకికి తెలుసు. మనకు తెలియాలనే ఈ కథను అంత విస్తారంగా వాల్మీకి రికార్డ్ చేశాడు.)

ఇందులో ధర్మ సూక్ష్మం ఏమిటంటే ఏదయినా తప్పు చేస్తే.. ఆ తప్పునకు శిక్ష అనుభవిస్తే ఆ అకౌంట్ సెటిలవుతుంది. పాపం మూట కట్టుకోకుండా ఉండే అవకాశం ఉంటుంది.

సాధారణంగా రామాయణం ఏడు కాండల్లో ఉత్తరకాండ ఎవరూ పారాయణ చేయరు కాబట్టి ఈ త్రేతాయుగపు కుక్క గోలకు పెద్దగా ప్రచారం జరిగి ఉండదు. గతజన్మల్లో ఏ అధర్మకర్తృత్వం వల్ల ఈ ఆరు కోట్ల కుక్కలు శునక జన్మ పొందాయో చెప్పగలిగినవారెవరు? రామరాజ్యం పోయి ఇప్పుడు ప్రజారాజ్యం వచ్చింది. ఈ ప్రజా రాజ్యంలో ఆరు కోట్ల కుక్కలు ధర్మగంట కొట్టి రాజునుండి రక్షణ అడగడానికి ఏ అయోధ్యకు వెళ్లాలి? వెళ్లినా.. అక్కడ ధర్మగంట ఎక్కడుంటుంది? ఉన్నా.. ధర్మగంట కొట్టగానే ధర్మం చెప్పేవారెవరు?

కుక్కగాట్లకు మనుషులు చస్తుంటే.. శునకప్రేమ ముఖ్యమా? అని మనిషి ప్రతినిధి అడుగుతున్నాడు. మనిషి మానవత్వం మరచి.. కుక్కల అంతు చూస్తుంటే జీవకారుణ్యం అవసరం లేదా అని జంతు ప్రతినిధులు అడుగుతున్నారు.

*ఇందులో ఎవరి వాదన తప్పు? ఎవరి వాదన ఒప్పు? మి లార్డ్స్!*

పమిడికాల్వ మధుసూదన్





## మూగ జీవాలను నిర్మూలిస్తారా?

Courtesy: Namaste Telangana

- అశాస్త్రీయం.. చట్ట విరుద్ధం
- ఢిల్లీలో వీధి కుక్కల తొలగింపుపై గొంతెత్తిన పలువురు ప్రముఖులు
- తీర్పును సమీక్షించాలని సీజేఐకి లేఖ

న్యూఢిల్లీ, ఆగస్టు 12: ఢిల్లీ ఎన్‌సీఆర్ పరిధిలో ఉన్న అన్ని వీధి కుక్కలను ఆవాస కేంద్రాలకు తరలించాలన్న సుప్రీం కోర్టు ఆదేశాలను కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ నుంచి మేనకా గాంధీ వరకు చాలామంది రాజకీయ నేతలు, బాలీవుడ్ నటులు, సెలబ్రిటీలు, నిపుణులు, హక్కుల కార్యకర్తలు, జంతు ప్రేమికులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. సుప్రీం కోర్టు ఆదేశాలను వ్యతిరేకించిన రాహుల్ గాంధీ దశాబ్దాల మానవీయ, సైన్స్ మద్దతు ఉన్న విధానాన్ని తిప్పికొట్టడంగా దీనిని అభివర్ణించారు. ఇటువంటి ఆదేశాలు చాలా క్రూరమైనవని, దూరదృష్టి లేనివని, పైగా ఇవి మనలోని మానవత్వాన్ని దూరం చేస్తాయని ఆయన విమర్శించారు. మూగజీవాలతో మనకు ఎంతమాత్రం సమస్య లేదని, వాటిని నిర్మూలించాలనడం సబబు కాదని ఆయన అన్నారు. ఢిల్లీ ఎన్‌సీఆర్ పరిధిలోని వీధి కుక్కల కారణంగా పలువురు, ముఖ్యంగా చిన్నారులు కుక్క కాట్లకు గురవుతున్నారని, రేబీస్ వ్యాధి బారిన పడుతున్నందున వాటిని సాధ్యమైనంత త్వరగా షెల్టర్ కేంద్రాలకు తరలించాలంటూ సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాలను పెటా సంస్థ తీవ్రంగా వ్యతిరేకించింది. ఆచరణీయం కానిది, అశాస్త్రీయమైనది, చట్ట విరుద్ధమైనదిగా పేర్కొంది. వీధి కుక్కల తొలగింపు పర్యావరణ సమతుల్యతను దెబ్బతీస్తుందని, అంతేకాకుండా ఆర్థికంగా ఇది ఆచరణీయం కూడా కాదని కేంద్ర మాజీ మంత్రి మేనకా గాంధీ విమర్శించారు. ఈ తీర్పు తమను షాకింగ్‌కు గురి చేసిందని, ఇది అంతర్జాతీయ ప్రజారోగ్య మార్గదర్శకాలకు, భారతీయ చట్టాలకు విరుద్ధంగా ఉందని ద ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ యానిమల్ ప్రొటక్షన్ ఆర్గనైజేషన్స్ (ఎఫ్ఐఏపీఓ) విమర్శించింది.

ఆదేశాలను సీజేఐ సమీక్షించాలి: జాన్ అబ్రహం

సుప్రీం కోర్టు జారీ చేసిన ఆదేశాలను సమీక్షించాలని సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్‌కు నటుడు జాన్ అబ్రహం విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన ఒక లేఖ రాస్తూ 'అవి దొంగలు కావు.. సమాజ కుక్కలని అని మీరు అంగీకరిస్తారని ఆశిస్తున్నాను. తరతరాలుగా మానవులకు పొరుగు వారిగా అవి జీవిస్తున్నాయి' అని పేర్కొన్నారు. సుప్రీం కోర్టు నిర్ణయాన్ని నటులు వరుణ్ ధావన్, అడివి శేషు, నటీమణులు జాహ్నవి కపూర్, సాన్యా మల్హోత్రాలు వ్యతిరేకిస్తూ సుప్రీం కోర్టు ఆదేశాలు వాటికి మరణ శిక్ష లాంటిదని వ్యాఖ్యానించారు.


ఎం.ఇర్షాద్
USHA ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE
WOMEN'S COLLEGE ROAD,
SRIKAKULAM - 532 001

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
శ్రీకాకుళంలో పనిచేయుటకు
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను
CONTACT
9440001447, 8341163666

# డీపీ దేవ్‌కు ధర్మాన పరామర్శ



సత్యంన్యూస్, శ్రీకాకుళం

రిటైర్డ్ ఎమ్మార్వో, శ్రీశయన కార్పొరేషన్ మాజీ చైర్మన్ డీపీ దేవ్‌ను మాజీ మంత్రి ధర్మాన ప్రసాద రావు ఇంటికి వెళ్లి పరామర్శించారు. దేవ్‌కు సడన్‌గా ఛాతీలో నొప్పి రాగా పెన్షనర్స్ సంఘం సభ్యుల సహకారంతో హాస్పిటల్‌లో చేర్పించారని, యాంజియోగ్రామ్ నిర్వహించి రెండు స్టంట్స్ వేశారని, ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగా ఉందని చెప్పారు. ధర్మానతో పాటు విశ్రాంత ఉద్యోగులు చందు, రామకృష్ణ, ఆంజనేయులు, మోహనరావు, స్థానిక వైకాపా నాయకులు రంగాజీ దేవ్, నక్క రామరాజు, రమేష్, హరిబాబు, గిరి, రామలింగేశ్వర స్వామి, నందికేశ్వరరావు, నక్క శంకరరావు, శ్రీశయన నాయకులు మెండ శాస్త్రి, శాంతమూర్తి, బంటుపల్లి కోటేశ్వరరావు, బంటుపల్లి క్రిష్ణ, లావేటి శ్యామ్, సొంగల ఈశ్వరరావు, ఉమామహేశ్వరరావు, బుంగ సత్యనారాయణ, ఉంకిలి ప్రసాద్, మావూరు శేఖర్, గోపాలరావు తదితరులు ఉన్నారు.

# మాజీ కౌన్సిలర్ మేడేపల్లి మృతి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



రిటైర్డ్ మెడికల్ హెల్త్ సూపరిం టెండెంట్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ మేడేపల్లి రామనారాయణ మృతి చెందారు. మేడేపల్లి భౌతిక కాయాన్ని మాజీమంత్రి ధర్మాన ప్రసాదరావు సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రామనారాయణ ఒక్క ఓటు తేడాతో కౌన్సిలర్‌గా గెలిచి ప్రజా సంక్షేమానికి, పట్టణ అభివృద్ధికి కృషి చేశారని అన్నారు. మృతి పట్టణ ప్రజలకు తీవ్ర లోటని, తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. సోషల్ మీడియా ఇన్చార్జ్ భరద్వాజ్, ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ శ్రీనివాస్ పట్నాయక్, వైకాపా నాయకులు ఎంఏ బేగ్,, సుంకరి కృష్ణకుమార్, ఎంఏ రఫీ, బైరి మురళి, బలగ పండరీనాథ్, జలగడుగుల శ్రీనివాస్, పొడుగు శ్రీనివాసరావు, మహాత్మా గాంధీ సేవా సంఘ సభ్యులు రామనారాయణ మృతికి సంతాపం తెలిపారు.

# సేవకు ప్రతిరూపం శ్రీనివాసరావు

- పుట్టినరోజు సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు
- శుభాకాంక్షలు తెలిపిన ప్రజాప్రతినిధులు, అధికారులు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నిస్వార్థ ప్రజాసేవకు ప్రతిరూపం సూర శ్రీనివాసరావు పుట్టిన రోజు వేడుకలు శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రముఖ వ్యాపారవేత్త డాక్టర్ సూర శ్రీనివాసరావు పుట్టినరోజు సందర్భంగా నగరంలోని పాలిటెక్నిక్ కళాశాల వద్ద ఉన్న క్రిస్టల్ ప్యాలెస్‌లో వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. నగరం లోని బెహర మనో వికాసకేంద్రంలో అల్పాహారం పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు దేవాలయాల్లోనూ, క్రిస్టల్ ప్యాలెస్‌లో ముస్లీం, క్రైస్తవ సోదరులు కలసి సర్వమత ప్రార్ధనలు చేశారు. అనంతరం నిర్వహించిన రక్తదాన శిబిరంలో నగరంలోని యువత పెద్ద సంఖ్యలో హాజరై రక్తదానం చేశారు. అనంతరం ఎచ్చెర్ల మండలం తోటపాలెం, చిలకపాలెం గ్రామాల్లో ప్రజలు సూర శ్రీనివాసరావుకు మంగళహారతులు, పూలదండలతో ఘనస్వాగతం పలికారు. ఈ రెండు చోట్ల కేక్ చేసి మహిళలకు అందజేశారు. అలాగే తోటపాలెం ప్రభుత్వ పాఠశాలలో కేక్ కట్ చేసి విద్యార్థులకు అందజేశారు. పాలిటెక్నిక్ కళాశాలలో 50 మొక్కలను నాటారు. సుమారు వెయ్యి మంది మహిళలకు చీరలు, దుస్తులు పంపిణీ చేశారు. రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు చౌదరి పురుషోత్తంనాయుడు, రచయిత లోకనాథం, ట్రాఫిక్ సీఐ నాగ రాజు, నగరానికి చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు, యువత పెద్ద ఎత్తున హాజరై అభినందనలు తెలిపారు.




# వేధింపులపై విచారణ జరిపించండి

- లోలుగు కేజీబీవీ ప్రిన్సిపల్ డిమాండ్
- ఎమ్మెల్యే కూనపై తీవ్ర ఆరోపణలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



తనపై కక్షగట్టి తప్పుడు అభియోగాలతో ఎమ్మెల్యే కూన రవికుమార్, సమగ్ర శిక్ష ఏపీసీ వేధిస్తున్నారని, అందులో భాగమే తన బదిలీ, తప్పుడు ఆరోపణలని లోలుగు కేజీబీవీ ప్రిన్సిపల్ రేజేటి సౌమ్య ఆరోపించారు. శ్రీకాకుళంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే కూన రవికుమార్ ప్రజా ప్రతినిధిలా కాకుండా నోరు తెరిస్తే అబద్ధాలు మాట్లాడుతూ తనపైన, తన కుటుంబంపైనా వ్యక్తిగత ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే అయి నంత మాత్రాన ఎవరి గురించైనా, ఏదైనా మాట్లాడవచ్చా అని ప్రశ్నించారు. పలుమార్లు తనకు వీడియో కాల్స్ చేశారని, ఆమదాలవలస పార్టీ కార్యాలయానికి పిలిపించి రాత్రి 11 గంటల వరకు ఉంచిన సందర్భాలు ఉన్నాయన్నారు. శారీ రకంగా, మానసికంగా వేధించడమే కాకుండా తనకు లొంగలేదన్న కక్షతో అకారణంగా కంచిలికి బదిలీ చేయించారని ఆరోపించారు. ఒంటరి మహిళలను టార్గెట్ చేయడం ఎమ్మెల్యేకు అల వాటేనని అన్నారు. కాగా సమగ్రశిక్ష ఏపీసీ శశి భూషణ్ ఆర్జేడీ విచారణ నివేదిక ప్రకారం తనను బదిలీ చేస్తున్నట్లు పేర్కొన్నారని, కానీ విచారణే జరగలేదని స్పష్టం చేశారు. అక్రమాలకు పాల్పడు తున్న ఏపీసీపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వీటన్నింటి నిగ్గు తేలాలంటే సీబీఐ లేదా సిటింగ్ జడ్జితో విచారణ జరిపించాలని సౌమ్య ప్రభుత్వాన్ని కోరారు.

# వికలాంగుల పెన్షన్ల తొలగింపు అమానుషం

- వైకాపా ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ



సత్యంన్యూస్, ఆమదాలవలస

ఏ పనీ చేసుకోలేక, ఎటువంటి జీవనాధారం లేక ప్రభుత్వ సంక్షేమ పథకం ద్వారా జీవనం సాగి స్తున్న వికలాంగుల పెన్షన్లు అకస్మాత్తుగా తొలగించి, వారిని రోడ్డున పడేయడం అమానుషమని వైకాపా ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ అన్నారు. శనివారం ఆమదాల వలసలోని వైకాపా నియోజకవర్గ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. నియోజకవర్గం లో దాదాపు 450 మంది వికలాంగుల పెన్షన్లు తొలగించారని, ఇందులో ఎంతోమంది గత 20 ఏళ్లుగా వికలాంగుల కేటగిరీలో పెన్షన్లు పొందు తున్నారని, వారి పింఛన్లు అకస్మాత్తుగా ఆపేయ డం వారి జీవితాలను చిదిమేయడమేనని రవి కుమార్ అన్నారు. పెన్షన్లు పోయినవారు మరలా సంబంధిత ఎండీవోకు అప్పీల్ చేయాలని, అప్ప టికీ న్యాయం జరగకపోతే కోర్టుకు వెళ్లి న్యాయం జరిగేలా పార్టీ తరఫున పోరాటం చేస్తామని చిం తాడ రవికుమార్ అన్నారు. విలేకరుల సమా వేశంలో ఆమదాలవలస వైకాపా అధ్యక్షులు పొడుగు శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి పొన్నాడ చిన్నా రావు, జిల్లా ఇంటలెక్చువల్ ఫోరమ్ అధ్యక్షులు కొప్పలి ఈశ్వరరావు, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ దుంపల శ్యామలరావు, పార్టీ నాయకులు బొడ్డేపల్లి నాగరాజు, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా టంగుటూరి జయంతి

(సత్యంన్యూస్, లావేరు)

ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని శనివారం లావేరు శాఖా గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ప్రకాశం పంతులు స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర వహిం చారన్నారు. టంగుటూరి జీవిత చరిత్రపై నిర్వహించిన వ్యాసరచన పోటీలో గెలుపొందిన గాయత్రికి ప్రథమ బహుమతిని గ్రంథాలయం తరఫున అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు టి.వీర భద్రుడు, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# 11 సూత్రాలు అందరూ పాటించాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రతీ నెలా మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర కార్య క్రమంలో భాగంగా పట్టణ రెండో డివిజన్ వరం కాలనీ పార్కు వద్ద సచి వాలయం సిబ్బంది, డివిజన్ ఇన్‌చార్జి అక్కేన రాజారావు ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఎంజే బాబు మాట్లాడుతూ వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్ర త్తలు తీసుకోవాలని కోరారు. మురుగు నీరు నిలువ ఉంచకూడదని, సురక్షిత నీరు మాత్రమే త్రాగాలన్నారు. చేతులు పరిశుభ్రంగా ఉంచుకో వాలని సూచించారు. కట్ చేసి నిల్వ ఉంచిన పండ్లు తినరాదన్నారు. యాంటీ సెప్టిక్ ద్రవాలతో శుభ్రపరచుకోవాలన్నారు. మరిగించిన నీరు త్రాగాలన్నారు. నీరు నిలవ ఉంచే కేన్లు శుభ్రంగా ఉంచుకోవా లన్నారు. వీధిలో అమ్మే ఆహార పదార్థాలు తినరాదని సూచించారు. పాడైయిపోయిన పండ్లు తినకూడదు. నీటి పాత్రలపై మూతలు వేసుకోవాలన్నారు. నీటిలో తడవకూడదన్నారు. ఈ సందర్భంగా మురుగు కుంటలలో దోమలను నివారించే బాల్స్ వేసారు. కార్యక్రమంలో కార్యాలయ శానిటరీ సిబ్బంది శివాజి, చిరంజీవి, భారతి, సువర్ణ, ధర్మారావు, ఆర్పీలు సంతోషి, పద్మ తదితరులు పాల్గొన్నారు.



# విధిగా స్వచ్ఛభారత్ చేయాలి

- జిల్లా గ్రంథాల సంస్థ కార్యదర్శి శంకరరావు



(సత్యంన్యూస్, లావేరు)

గ్రంథాలయంలోనూ, గ్రంథాలయ ఆవరణలోనూ పరిసరాలు పరి శుభ్రంగా ఉంచాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.శంక రరావు అన్నారు. లావేరు శాఖా గ్రంథాలయం ఆవరణలో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛభారత్ కార్యక్ర మం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలోని రికార్డుల ను తనిఖీ చేశారు. గ్రంథాలయ సిబ్బంది పాఠకులను, డిపాజిట్‌దా రులను పెంచుతూ గ్రంథాలయ సెస్ వసూలుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు, పోస్ట్ మాస్టర్ లక్ష్మి, గ్రంథాలయ సహాయకులు టి.వీరభద్రుడు, పాఠకులు పాల్గొన్నారు.

# ఆదిత్యుని అన్నదానానికి లక్ష విరాళం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రత్యక్షదైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామి నిత్యాన్నదానా నికి విశాఖపట్నానికి చెందిన కొల్లి తిరునాథరెడ్డి, ఝాన్సీరాణి దంప తులు రూ.1,01,116 విరాళం అందజేశారు. శనివారం స్వామిని దర్శించుకొని తిరునాథరెడ్డి తన తల్లి కొల్లి సత్యవతి జ్ఞాపకార్థం ఈ మొత్తాన్ని ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర్‌శర్మ, ఆలయ కార్యనిర్వా హణాధికారి కేఎన్‌వీడీవీ ప్రసాద్‌లకు అందజేశారు. వారికి ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించగా, స్వామివారి ప్రసాదం, ఫోటో జ్ఞాపికను అందజేసినట్లు కార్యనిర్వహణాధికారి తెలిపారు.



'సత్యం'లో ప్రకటనల కొరకు సంప్రదించండి
8019 221 221

# ఆదిత్యుని సేవలో జీఎస్టీ జాయింట్ కమిషనర్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఆరోగ్య ప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామిని శనివా రం జీఎస్టీ జాయింట్ కమిషనర్ పి.రామ్‌కోటేశ్వరరావు దర్శించుకు న్నారు. దేవాలయానికి వచ్చిన ఆయనకు ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ, ఆలయం సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయ అర్చకులు, వేద పండితులు వేద మంత్రాలతో ఆశీ ర్వదించారు. వారికి స్వామివారి ప్రసాదాలను, చిత్రపటం అందజేశారు.



# ప్రస్తుత పరీక్షల విధానాన్ని ఉపసంహరించుకోవాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రాష్ట్రవ్యాప్త కార్యక్రమంలో భాగంగా అసెస్‌మెంట్ బుక్‌లెట్ విధా నాన్ని ఉపసంహరించుకోవాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పల భానుమూర్తి కోరారు. ఈమేరకు డీఈఓ రావాడ రవిబాబుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ అసెస్మెంట్ బుక్ లెట్స్ విధానం వలన ఉపాధ్యాయులకు విద్యార్థులకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఆ విధానం వలన బోధన సమయం హరించు కుపోతుందన్నారు. జవాబు పుస్తకాలు ఇంటికి పట్టుకువెళ్లి వాల్యుయే షన్ చేసే పరిస్థితి లేదని, పరీక్ష పేపర్లు దిద్దిన తరువాత కూడా ఆన్‌లైన్‌లో నమోదు చేయటం వంటి అనేక ఇబ్బందులు ఉన్నాయన్నారు. 2021-22 వేసవి సెలవులలో అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు పనిచేసిన ప్రధా నోపాధ్యాయులు ఉపాధ్యాయులు నాన్‌టీచింగ్ స్టాఫ్‌కు కమిషనర్ ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం సంపాదిత సెలవు మంజూరి ప్రొసీడింగ్స్ ఇవ్వాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి ఎస్‌వీ అనిల్‌కుమార్, ఉపాధ్యక్షులు పి.అప్ప లనాయుడు, జిల్లా కార్యదర్శులు డి.రామ్మోహనరావు, చావలి శ్రీనివాస్, జిల్లా ఎడిట్ కమిటీ సభ్యులు ఎస్.శంకరరావు, ఏపీటీఎఫ్ కార్యకర్తలు మహేష్, సీహెచ్ త్రినాథరావు, బి.భానుమూర్తి, డి.శ్రీని వాసరావు, ఎం.వి.కామేష్ మొదలగువారు పాల్గొన్నారు.



# ఆంధ్రకేసరి పోరాట స్ఫూర్తి గొప్పది

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్య మంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు పోరాట స్ఫూర్తితో పాటు నిజాయితీ, విలువలకు నిలువటద్దంగా నిలిచిన జీవనం ఎంతో గొప్పదని వక్తలు పేర్కొన్నారు. టంగుటూరి 153 జయంతి వేడుకలు శ్రీకాకుళం పట్టణం గాంధీ మందిరం స్వాతంత్ర్య సమరయోధులు సంఘ సంస్కర్తల స్మృతి వనంలో శనివారం ఘనంగా జరిగాయి. విగ్రహ సమర్పకులు మెట్ట గౌరీశంకర్‌తో పాటు మందిర ప్రతినిధుల బృందం టంగుటూరు విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం వావిలపల్లి జగన్నాథంనాయుడు, చౌదరి రాధాకృష్ణ, డాక్టర్ చింతాడ కృష్ణమోహన్, డాక్టర్ జామి భీమశంకర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో ఆంధ్రకేసరిగా ప్రకాశం పంతులు ఎదిగిన వైనాన్ని వివ రించారు. బ్రిటిష్ పాలకుల దురాఘాతాలు తన గుండెను ఎదురొడ్డిన ధీశాలి టంగుటూరి అన్నారు. న్యాయవాదిగా సంపాదించిన ఆస్తిని స్వాతంత్ర్య ఉద్యమానికి అందించిన దాత అని కొనియాడారు. ముఖ్యమంత్రిగా పనిచేసినప్పటికీ ఎప్పుడూ సాధారణ జీవితాన్ని గడిపిన ప్రకాశం పంతులు విలువలకు నిలువెత్తు నిదర్శనమన్నారు. చివరి రోజుల్లో ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్న టంగుటూరి నీతి, నిజాయితీకే పెద్దపీట వేసిన స్ఫూర్తిని నేటితరం ప్రజా ప్రతినిధు లు అందిపుచ్చుకోవాలన్నారు. ఆంధ్రకేసరి గొప్పతనాన్ని అవధాన పండితులు పైడి హరనాధరావు, నిష్టల నరసింహమూర్తి గేయాలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ గవర్నర్ కొంక్యాన మురళీధర్, గాంధీ మందిర ప్రతినిధులు నటుకుల మోహన్, కొమ్ము రమణమూర్తి, నక్క శంకరరావు, పెంకి చైతన్య కుమార్, జి.నాగేశ్వరరావు, సుగంధం సంజీవరావు, సువ్వారి రాజా రావు, శాస్త్రి తదితరులున్నారు.



Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.